TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 261 | ఆదివారం 13-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ...? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

## 'బ్రిక్స్' ఎవరికీ వ్యతిరేకం కాదు: మోదీ

- 'బ్రిక్స్' ఎవరికీ వ్యతిరేకం కాదు: మోదీ
- ప్రపంచ సంఘర్షణలకు పరిష్కారం చూపాలి
- గ్లోబల్ సౌత్‌కు నిర్ణయాల్లో భాగస్వామ్యం
- ఏఐ, సైబర్, బయోటెక్‌లో సహకారం
- ఐరాస భద్రతామండలిలో సంస్కరణలు
- పలు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలి




మిగతాది 2లో

### బ్రిక్స్ డిక్లరేషన్.. సభ్యదేశాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం

- ఏకపక్ష యుద్ధాలను ఖండించేందుకు నిర్ణయం
- ఇరాన్--యూఏఈ విభేదాలపై చర్చలు
- ఆర్థిక, ఇంధన రంగాల్లో సహకారం

#### బ్రిక్స్ డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం

బ్రిక్స్ డిక్లరేషన్ కోసం సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. దేశం పేరును ప్రస్తావించకుండా.. ఏ దేశమైనా చేసే ఏకపక్ష యుద్ధాన్ని ఖండించే ఉమ్మడి ప్రకటనను వెలువరించడానికి



మిగతాది 2లో

## లాల్‌బాగ్‌చా ప్రసాద వ్యర్థాలు..
## ఆ ఆస్పత్రులకు వెలుగునిస్తాయి..!



ముంబయి లో అత్యంత ప్రాచుర్యం పొందిన లాల్‌బాగ్‌చా రాజా గణపతి నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యారు. 1934 నుంచి లాల్‌బాగ్‌చా మార్కెట్‌లో కొలువుదీరే ఈ గణనాథుడి వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతాయి. ఇక్కడికి పెద్ద సంఖ్యలో సినీ, రాజకీయ ప్రముఖులు వస్తుంటారు. ఈ సారి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తోన్న బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కీలక ప్రకటన చేసింది. మండపం వద్ద ఆహార వ్యర్థాలను విద్యుత్‌గా మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపింది. నవరాత్రి సమయంలో ఈ మండపం వద్ద రోజుకు 8-10 టన్నుల సేంద్రియ వ్యర్థాలు పేరుకుంటాయి. ఆ వ్యర్థాలను బయో ఎలక్ట్రిసిటీ గా మార్చి, స్థానిక ఆస్పత్రులలో విద్యుత్ ఉత్పత్తికి వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

మిగతాది 2లో

### ఎంత బుకాయించినా చేసిన తప్పు నుంచి తప్పించుకోలేరు:

- బుకాయించినా తప్పించుకోలేరు: హరీశ్‌రావు
- 22ఏపై మంత్రి సమాధానం ఇవ్వలేదు
- ప్రశ్నించినందుకే సస్పెండ్ చేశారంటూ ఆరోపణ
- సీఎం ఇంటి భూమిని తొలగించారు
- 9,200 డాక్యుమెంట్లపై హరీశ్‌రావు ఆరోపణ
- 22ఏ నుంచి భూములు ఎప్పటిలోగా తొలగిస్తారు?



మిగతాది 2లో

## 22ఏ మా ప్రభుత్వం తీసుకురాలేదు..
## 1999లోనే అమల్లోకి: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: 22ఏ నిషేధిత భూముల అంశంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 22ఏను తమ ప్రభుత్వం కొత్తగా తీసుకురాలేదని, 1999లోనే 22ఏ నిబంధన అమల్లోకి వచ్చిందని స్పష్టం చేశారు. అసైన్డ్, ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకే 22ఏను తీసుకొచ్చారని తెలిపారు. 2015లో 22ఏ అంశంపై ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చిందని పొంగులేటి అన్నారు. కోర్టు ఆదేశాల మేరకు 22ఏ భూములను ఐదు కేటగిరీలుగా విభజించారని, అనంతరం 2016లో జీవో నంబర్ 121ను తీసుకొచ్చారని చెప్పారు. అయితే జీవో జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించిన విధివిధానాలను ప్రకటించలేదన్నారు.
ధరణి తీసుకొచ్చే క్రమంలో కోర్టు ఆదేశాలను పక్కన పెట్టారని పొంగులేటి ఆరోపించారు. 2017 నుంచి 2025 వరకు 28,611




- 22ఏను మా ప్రభుత్వం తీసుకురాలేదు.. 1999లోనే అమల్లోకి వచ్చింది.
- అసైన్డ్, ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకే 22ఏను తీసుకొచ్చాం.
- 2015లో ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది.
- కోర్టు ఆదేశాల ప్రకారం 22ఏ భూములను ఐదు కేటగిరీలుగా విభజించారు.
- ధరణి తీసుకొచ్చే క్రమంలో కోర్టు ఆదేశాలను పక్కన పెట్టారు.
- నకిలీ జీవోలు సృష్టించిన వారిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం.

మిగతాది 2లో

## గిట్టుబాటు ధర లేకపోతే.. ప్రభుత్వం అండగా నిలుస్తోంది: అచ్చెన్నాయుడు




అమరావతి: పంటకు గిట్టుబాటు ధర లేక రైతు నష్టపోయే పరిస్థితి వస్తే.. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అండగా నిలుస్తోందని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ పేరుతో భారీగా ప్రచారం చేసుకున్నా.. రైతులకు మాత్రం ఆ స్థాయిలో ప్రయోజనం దక్కలేదని విమర్శించారు. ఐదేళ్లలో మార్కెట్ ఇంటర్వెన్షన్ కోసం రూ. 2,140 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినట్లు చూపించి.. వాస్తవంగా రూ. 1,475 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు.

పేజి 2లో ▶

## హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### హైదరాబాద్‌ను బ్లూ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- క్యూఆర్ చట్టంతో సమర్థవంతమైన పాలన
- మూసీ పునరుజ్జీవానికి రూ.7,345 కోట్లు
- 20 టీఎంసీల గోదావరి జలాలు



మిగతాది 2లో

### 19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల డిసెంబర్ కోటా విడుదల



మిగతాది 2లో

## ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తాం..
## పేదల ఖర్చు తగ్గిస్తాం: సీఎం చంద్రబాబు

- ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తాం: చంద్రబాబు
- పేదల వైద్య ఖర్చు తగ్గిస్తాం
- 500 బెడ్లతో క్రిటికల్ కేర్ సేవలు
- సంజీవని ప్రాజెక్ట్ గేమ్‌ఛేంజర్
- అర్హులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా
- రూ.64 వేల కోట్లతో ఆరోగ్య వ్యవస్థ బలోపేతం
- ఏపీలో 24 క్రిటికల్ కేర్ బ్లాకులు



మిగతాది 2లో

అమరావతి: కేంద్రం సహకారం, రాష్ట్ర సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే నెం.1 స్థానం దక్కిందని సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడ లోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. 500 బెడ్లతో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, తద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు గణనీయంగా ఖర్చు తగ్గుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సంజీవని ప్రాజెక్ట్ గేమ్‌ఛేంజర్‌గా మారబోతోందన్నారు. "ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్‌గా మారబోతోంది. ఆయుష్మాన్ భారత్ పథకంతో చాలామందికి ప్రయోజనం చేకూరుతుంది. అర్హులైన వారికి రూ.5లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది. జేపీ నడ్డా నాయకత్వంలో ఆరోగ్య రంగంలో కొత్త విప్లవాలు వచ్చాయి. ఆరోగ్య రంగంలో పెనుమార్పులకు డబుల్ ఇంజిన్ సర్కారే కారణం.

## కీలక ప్రాజెక్టులపై కేంద్రమంత్రి జేపీ నడ్డాతో చంద్రబాబు చర్చలు

- చంద్రబాబు--జేపీ నడ్డా కీలక భేటీ
- రాష్ట్ర అభివృద్ధిపై చర్చలు
- కీలక ప్రాజెక్టులపై సమీక్ష
- కేంద్ర--రాష్ట్ర సమన్వయంపై చర్చ
- క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం



మిగతాది 2లో

## రాజకీయ అప్పుల భారంతో బీఆర్ఎస్ నేత బలవన్మరణం:

# ఎండపల్లి మండలంలో విషాదం

**- పార్టీ ఖర్చులే ముంచేశాయి.. చదివిన వారిని కంటతడి పెట్టిస్తున్న సింహాచలం జగన్ ఆవేదన లేఖ**

**- 'నా కుటుంబాన్ని, పిల్లలను ఆదుకోండి': ఆత్మహత్యకు ముందు బీఆర్ఎస్ అగ్రనేతలకు విజ్ఞప్తి**



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

రాజకీయాల కోసం చేసిన అప్పుల భారం తట్టుకోలేక, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి బీఆర్ఎస్ ఎండపల్లి మండల మాజీ అధ్యక్షుడు, ఆర్ఎంపీ వైద్యుడు సింహాచలం జగన్ రాసిన అత్యంత వేదనారహిత లేఖ స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. 2002 నుండి గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలు అందిస్తూ, వార్డు మెంబర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, 2013లో సర్పంచ్‌గా గెలిచి ప్రజలకు అందుబాటులో ఉన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరి వెల్గటూర్ మరియు ఎండపల్లి మండలాల్లో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించారు. అయితే పార్టీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిత్యం సమావేశాలు, ఊరేగింపులు, కరీంనగర్, ధర్మపురి, హైదరాబాద్ ప్రయాణాల కోసం సొంతంగా భారీగా ఖర్చులు చేయాల్సి వచ్చిందని లేఖలో పేర్కొన్నారు. రోజువారీ రాజకీయ కార్యక్రమాల వల్ల తన వైద్య ప్రాక్టీస్ దెబ్బతిని ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సర్పంచ్‌గా చేసిన పనుల బిల్లులు కూడా ఇప్పటివరకు రాకపోవడం, ఈఎంఐలు, కుటుంబ ఖర్చుల కోసం చేసిన అప్పులు వడ్డీలతో కలిపి రూ. 20 లక్షలకు పైగా పెరిగిపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారు. అప్పుల నుంచి గట్టెక్కడానికి ఇల్లు, ప్లాట్లు, కారుపై రుణాలు తీసుకోవడమే కాకుండా భార్య, అత్తమామల బంగారం కూడా తాకట్టు పెట్టాల్సి వచ్చిందని వాపోయారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య పల్లవి, 11 ఏళ్ల కూతురు సంజన, 5 ఏళ్ల కుమారుడు సుధాంష్ భవిష్యత్తు తలుచుకుంటే భయమేస్తోందని నివేదించారు. ఈ కష్ట సమయంలో తన పిల్లలను అనాథలను చేయకుండా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ అధినాయకత్వం, స్థానిక నేతలు, గ్రామానికి చెందిన మిత్రులు అండగా నిలిచి ఆదుకోవాలని వేడుకున్నారు. రాజకీయాల కోసం కుటుంబ భవిష్యత్తును నాశనం చేసుకున్నానని, ఎవరూ తనలాంటి పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరిస్తూ ఆయన రాసిన ఈ లేఖ నెట్టింట తీవ్ర విషాదాన్ని నింపింది.

## తడి పొడి పద్ధతితో వరి సాగు..

## అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కొనరావుపేట మండలం / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్




రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో రైతులకు అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు పంటల సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా శనివారం "తడి పొడి పద్ధతి"లో వరి సాగు ఎలా చేయాలో ప్రాక్టికల్ గా వివరించారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో జిల్లెల్ల అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు పూజిత,సింధూజ,ఉమా, నైషిత,దీపిక,హర్షిణిలు పంట పొలాలను పరిశీలిస్తూ..రైతులకు ౧=ఎఖ కోఆర్డినేటర్ డా.సాయి కుమార్ ఆధ్వర్యంలో సూచనలు,సలహాలు అందిస్తున్నారు. =ూఔెజ్రూ ద్వారా ఫీల్డ్ విజిట్ చేస్తున్నట్లు మీడియాకు తెలిపారు. వరి పంటకు నిరంతరం నీరు ఇవ్వకుండా 30 సెంటీమీటర్ల పైపును తీసుకొని కింది చివరి భాగంలో 15 సెం.మీ రంధ్రాలతో సిద్ధం చేసుకొని పొలంలో అమర్చి నీటి మట్టాన్ని గమనిస్తూ..నీరు ఇవ్వాలని రైతులకు సూచించారు. దీనివల్ల నీరు పొదుపు అవ్వడమే కాకుండా తడి పొడి విధానం ద్వారా వరి సాగు చేయడం వల్ల దిగుబడి పెరగడంతో పాటు నీటి ఆదా,చీడపీడలు కూడా రాకుండా ఉంటాయనే విషయాన్ని రైతులకు విద్యార్థిని సింధూజ వెల్లడించారు. ఇలా చేయడం ద్వారా వారి పైరు వారం రోజుల ముందే కోతకు వస్తుందని పేర్కొన్నారు. రైతులందరూ వరి పంట పొలాలలో ఈ విధానాన్ని అవలంబించాలని అగ్రికల్చర్ విద్యార్థులు కోరారు.

## ఫోర్జరీ సంతకాలతో జూనియర్ కళాశాల విక్రయం

## : సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**- శ్రీకృష్ణదేవరాయ కళాశాల విక్రయంపై వివాదం: బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు**

**- తమకు తెలియకుండానే కళాశాల బదిలీ: వికాస్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్ ఆరోపణ**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్




సిరిసిల్ల పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలను తమకు తెలియకుండా, ఫోర్జరీ సంతకాలతో ఇతరులకు విక్రయించారని ఆరోపిస్తూ కళాశాల నిర్వాహకుడు, వికాస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్ సిరిసిల్ల టౌన్ పోలీసులను ఆశ్రయించారు. 2004లో రాజరాజేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ఈ కళాశాల బాధ్యతలను తాము పర్యవేక్షిస్తున్నామని, సొసైటీకి తాను అధ్యక్షుడిగా, తన భార్య దిడ్డి రమ సభ్యురాలిగా ఉన్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. కళాశాల ఆర్థిక లావాదేవీలు, లెక్కలు చూపించాలని ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల జగన్‌గౌడ్‌ను పలుమార్లు కోరినా సమాధానం దాటవేస్తూ రావడంపై అనుమానం వచ్చి ఆరా తీయగా కళాశాల విక్రయ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇంటర్మీడియట్ బోర్డును సంప్రదించి పత్రాలు పరిశీలించగా, 2023 డిసెంబర్ 1న తమకు తెలియకుండానే జనరల్ బాడీ సమావేశం నిర్వహించినట్లు చూపి, తమ సంతకాలను ఫోర్జరీ చేసి మోసపూరితంగా కళాశాలను ఇతరుల పేరిట బదిలీ చేసినట్లు గుర్తించామన్నారు. దిడ్డి శ్రీనివాస్ ఇచ్చిన పిటిషన్ ఆధారంగా సిరిసిల్ల పోలీసులు భారతీయ నాయ సంహిత సెక్షన్లు 318(4), 336(3), 340(2), 3(5) కింద కేసు (క్రైమ్ నంబర్ 298/2026) నమోదు చేశారు. ప్లాట్ పత్రాలు, సొసైటీ హక్కులు, ఆర్థిక లావాదేవీల పత్రాలను సేకరించి పరిశీలిస్తున్నామని, ఫోర్జరీ ఆరోపణలు ఉన్న వ్యక్తుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ప్రజారోగ్యమే ప్రథమ కర్తవ్యం

# సర్పంచ్ బట్టు కృష్ణ

**- త్రాగునీటి ట్యాంక్ శుభ్రం చేయించిన సర్పంచ్**

**- లక్ష రూపాయల ప్రభుత్వ నిధులతో వాటర్ ట్యాంకర్ కి నిచ్చెన ఏర్పాటు..**

వీర్నపల్లి సెప్టెంబర్ 12 ప్రజాదివాస్




గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి ట్యాంక్‌ను వెంటనే శుభ్రం చేయించాలని గ్రామ సర్పంచ్ బట్టు కృష్ణ ఆదేశించారు. సర్పంచ్ ఆదేశాల మేరకు గ్రామంలోని త్రాగునీటి ట్యాంక్‌ను మల్టీపర్పస్ వర్కర్లతో పూర్తిగా శుభ్రం చేయించారు. ట్యాంక్‌లో పేరుకుపోయిన మురికి, మలినాలను తొలగించి, ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందేలా సర్పంచ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో త్రాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ట్యాంకులను పరిశీలిస్తూ, అవసరమైన చోట శుభ్రపరిచే చర్యలు చేపడతామని సర్పంచ్ బట్టు కృష్ణ తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడం గ్రామ పంచాయతీ ప్రధాన బాధ్యత అని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మల్టీపర్పస్ వర్కర్లు చారి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఏ రాజన్నా సిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**- జిల్లా ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్**

**- ఎలక్షన్ ఆఫీసర్‌గా డాక్టర్ మనోహర్: ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ**

**- ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తాడుక సాయికుమార్, ట్రెజరర్‌గా డాక్టర్ జైల్ సింగ్**

**- మాజీ అధ్యక్షురాలు డాక్టర్ శోభారాణి సమక్షంలో నూతన బాధ్యుల ఎంపిక**

**- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రధాన ధ్యేయం**



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 13 ప్రజాదివాస్

సిరిసిల్ల: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాజన్నా సిరిసిల్ల జిల్లా శాఖ 2026-2027 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఐఎంఏ సర్వసభ్య సమావేశంలో నూతన బాధ్యుల ఎంపిక పూర్తయింది. జిల్లా అధ్యక్షుడిగా వేములవాడకు చెందిన ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సిరిసిల్ల సరయు ఆసుపత్రి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ తాడుక సాయికుమార్, కోశాధికారిగా శ్రీ మహాలక్ష్మి ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ ఎ. జైల్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ పి. యాదగిరి, డాక్టర్ జి. అభినయ్, సహ కార్యదర్శులుగా డాక్టర్ వెంకట్, డాక్టర్ మోహనకృష్ణ, డాక్టర్ చందన ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. ఐఎంఏ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ శోభారాణి సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికల ప్రక్రియ అంతటినీ వేములవాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మనోహర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి, అత్యంత పారదర్శకంగా మరియు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, రాజన్నా సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సామాన్య ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాలు, ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో సేవలందిస్తున్న వైద్యుల సంక్షేమానికి, వారి హక్కుల రక్షణకు మరియు వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి ఐఎంఏ సంస్థ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య రంగానికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తూ, జిల్లాలో అత్యవసర వైద్య సేవా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ఐఎంఏ రాజన్నా సిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గానికి జిల్లాలోని పలువురు సీనియర్ వైద్యులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు మరియు ప్రముఖులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## వేములవాడ రాజన్న సన్నిధిలో

## నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు

**- ఏర్పాట్లను పరిశీలించిన ఈవో రమాదేవి**



వేములవాడ / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని 10 రోజుల పాటు (సెప్టెంబర్ 14 నుంచి 23 వరకు) ఈ వేడుకలు జరగనున్నాయి. ఆలయంలో ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నందున, ప్రధాన ఆలయంలో వినాయక నవరాత్రులను ఏకాంతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. భక్తుల దర్శనార్థం ఆలయ అనుబంధ విభాగమైన శ్రీ భీమేశ్వరస్వామి మండపంలో ప్రత్యేకంగా గణపతి మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రంగురంగుల పుష్పాలు, విద్యుద్దీపాల అలంకరణలతో మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) రమాదేవి శుక్రవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ రామ్ కిషన్ రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, ఆలయ పండితులు, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# సాగునీటికై రైతుల పోరు: వంతడుపుల - కరీంనగర్ రహదారిపై రాస్తారోకో

**- ఎండిపోతున్న పంటలు: మధ్య మానేరు కుడి కాలువ నీటి కోసం రోడెక్కిన రైతన్నలు**

ఇల్లంతకుంట మండలం /.సెప్టెంబర్ 12 ప్రజాదివాస్



మధ్య మానేరు కుడి కాలువ పరిధిలో ఎండిపోతున్న పంట పొలాలకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడుపుల, వల్లంపట్ల, రంగంపేట, పాండలపురం గ్రామాల రైతులు వంతడుపుల - కరీంనగర్ ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో చేపట్టారు. కళ్లముందే పంటలు ఎండిపోతుండటంతో చేసేది లేక రహదారిపైకి వచ్చి నిరసన తెలిపాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ పక్కనే భూములు ఉన్నప్పటికీ సాగునీరు అందక ఎకరాకి వేల రూపాయల పెట్టుబడి, పడ్డ కష్టం వృథా అవుతున్నాయని వాపోయారు. ఓట్ల కోసం వచ్చే ప్రభుత్వం, రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కుడి కాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని, నీరందక నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు తీరే వరకు పోరాటం ఆపేది లేదని, వ్యవసాయం నిలబడితేనే రాష్ట్రం నిలబడుతుందని స్పష్టం చేశారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

**- సిరిసిల్ల బీజేపీ జిల్లా కార్యాలయంలో 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యశాల**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా 25 ఏళ్లుగా అందిస్తున్న నిరంతర ప్రజాసేవా ప్రస్థానం ప్రతి బీజేపీ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని ఆ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తి చేసుకున్న సందర్భంగా, కేంద్ర, రాష్ట్ర పార్టీల ఆదేశాల మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో 'సేవా సంకల్ప్ అభియాన్' జిల్లా కార్యశాలను నిర్వహించారు. సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కన్వీనర్, ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్ రెడ్డితో కలిసి గోపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో 9 ప్రధాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాక్షేత్రంలో నిరంతరం ఉంటూ ప్రజల సమస్యలపై పోరాడే వారే నాయకులుగా ఎదుగుతారని, మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమష్టిగా కృషి చేస్తే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, సిరిసిల్ల జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. నెల రోజుల పాటు చేపట్టే సేవా కార్యక్రమాల్లో కార్యకర్తలంతా చురుగ్గా పాల్గొనాలని, కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు,



అవకాశాలు లభిస్తాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, పార్లమెంట్ కో కన్వీనర్ దశరథం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బర్కం లక్ష్మి, శీలం రాజు, మల్లారపు సంతోష్ రెడ్డి, నాయకులు మిస సంజీవ్, ఉడుగుల యాదగిరి, రేగుల సంతోష్ బాబు, పల్లం అన్నపూర్ణ, దుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యం: కట్కూరి రమేష్

**- బీఎస్పీ వేములవాడ నియోజకవర్గ కార్యదర్శిగా ధర్నా ఎల్లయ్య యాదవ్ నియామకం**

వేములవాడ / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల రాజ్యాధికారం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)తోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్, వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు కట్కూరి శంకర్ పేర్కొన్నారు. రుద్రంగి మండల అధ్యక్షుడు దయ్యాల ఉదయ్ ఆధ్వర్యంలో శనివారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రంగికి చెందిన ధర్నా ఎల్లయ్య యాదవ్ బీఎస్పీలో చేరగా, ఆయనకు నాయకులు నీలం కండువా కప్పి పార్టీలోకి



ఆహ్వానించారు. అనంతరం బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. మాన్యం కాన్షీరామ్ బీసీల హక్కులు, రాజ్యాధికారం కోసమే బీఎస్పీని స్థాపించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీలన్నీ అగ్రకులాల ఆధిపత్యంలోనే నడుస్తున్నాయని, బహుజనులు తమ హక్కుల సాధన కోసం బీఎస్పీలో చేరాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ధర్నా ఎల్లయ్య యాదవ్‌ను బీఎస్పీ వేములవాడ నియోజకవర్గ కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం, రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యమని నమ్మి పార్టీలో చేరానని, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఏనుగందుల సతీష్, కోశాధికారి కట్కూరి వినోద్, సీనియర్ నాయకుడు కదాసు మహేందర్, సలహాదారు కదాసు అనిల్, గ్రామ అధ్యక్షుడు నల్ల నవదీప్, ప్రధాన కార్యదర్శి లింగాల రవీందర్, కోశాధికారి బొడ్డు చిరంజీవి, నాయకులు గాసికంటి అరుణ్, అక్కెనపెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# కురుమలకు ప్రత్యేక రిజర్వేషన్లు, పథకాలు ప్రకటించాలి: దండు వినోద్



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

అసెంబ్లీలో కురుమ కులంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో మాట్లాడుతూ.. కురుమలు ఆస్తులు, అంతస్తుల పరంగా వృద్ధిలో ఉన్నప్పటికీ, కుల వృత్తుల్లో నిమగ్నమై చదువుకు దూరంగా ఉండటం వల్ల సమాజంతో కనెక్షన్లు తెగిపోయాయని, నోమాడిక్ ట్రైబ్స్ లాగా సామాజికంగా వెనుకబడి ఉన్నారని వ్యాఖ్యానించినట్లు పేర్కొన్నారు. దీనిపై దండు వినోద్ స్పందిస్తూ.. అగ్రకుల నాయకుల పాలనలో తమ బిడ్డలకు ఉపాధి దొరకదనే భావనతో, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కులవృత్తులు, వ్యవసాయ పనులు చేసుకుంటూ కొంతవరకు చదువుకు దూరంగా ఉంచడం వాస్తవమేనన్నారు. సీఎం స్వయంగా అసెంబ్లీ సాక్షిగా సర్వే ఆధారంగా కురుమలు సామాజికంగా వెనుకబడి ఉన్నారని వెల్లడించినందున, వారిని ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక పథకాలు తీసుకురావాలని, విద్య, ఉపాధి రంగాల్లో స్పెషల్ రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కురుమ సామాజికవర్గానికి చెందిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కూడా ఈ అంశంపై ప్రభుత్వంతో చర్చించి కుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ నెలాఖరులో సీఎం సిరిసిల్ల పర్యటన ఉన్న నేపథ్యంలో, అప్పటిలోగా కురుమ కులానికి కొత్త పథకం లేదా ప్రత్యేక రిజర్వేషన్ ప్రకటించకపోతే, తమ సామాజిక పరిస్థితిపై సిరిసిల్ల పర్యటనలోనే నిలదీసి తేల్చి చెబుతామని దండు వినోద్ హెచ్చరించారు.

# రాజీ మార్గంలో సమస్యలకు శాశ్వత పరిష్కారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ

**- జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: రాజన్నా సిరిసిల్ల జిల్లా కోర్టులో ప్రారంభ సమావేశం**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

సిరిసిల్ల: ప్రజలు చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా నష్టపోకుండా పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (ఛైర్మా) అధ్యక్షురాలు పి.నీరజ సూచించారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందుతుందన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ




సమయం, డబ్బు, మానసిక ప్రశాంతత కోల్పోవడం కంటే ఇరుపక్షాలు చర్చల ద్వారా రాజీకి రావడం ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. భార్యాభర్తలు చిన్నపాటి విభేదాలతో విడిపోకుండా కలిసి జీవించాలని, అన్నదమ్ములు ఆస్తులు, భూ వివాదాల్లో తగాదాలకు వెళ్లకుండా "కలిసి ఉంటే కలదు సుఖం" అనే సూత్రంతో కుటుంబ ఐక్యతను కాపాడుకోవాలని కోరారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న మీడియా ప్రతినిధులకు, సహకరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి పి.లక్ష్మణాచారి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవునూరి రమాకాంతరావు, డీఎస్పీ నాగేంద్రచారి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, పలువురు న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి: సిపిఎం నేత స్కైలాబ్ బాబు

వేములవాడ / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను జేబు సంస్థలుగా మార్చుకుని ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు ఆరోపించారు. శనివారం వేములవాడలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "భారత రాజ్యాంగం - ప్రజాస్వామ్యం - సవాళ్లు" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్, బిజెపి కబంధహస్తాల నుండి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని, దేశ సమైక్యతకు సెక్యులరిజం, ప్రజాస్వామ్యమే రెండు కళ్లని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్, పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టు




ఎల్లారెడ్డిపేట మండలం / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర శాఖ శనివారం 'ఛలో అసెంబ్లీ'కి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఎల్లారెడ్డిపేట పోలీసులు ఏబీవీపీ నాయకులు పెంద్యాల శివ, ఆదరవేణి కృష్ణలను తెల్లవారుజామున వారి నివాసాల వద్ద ముందస్తుగా అరెస్టు చేశారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం శాంతియుతంగా తలపెట్టిన కార్యక్రమాన్ని ముందస్తు అరెస్టులతో అడ్డుకోవడాన్ని ఏబీవీపీ నాయకులు ఖండించారు. అరెస్టులతో విద్యార్థుల సమస్యలపై పోరాటాన్ని ఆపలేరని వారు స్పష్టం చేశారు. వెంటనే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# సాగునీళ్లు విడుదల చేయకుంటే 'చలో మధ్యమానేరు': జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

**- ఇల్లంతకుంట మండలం పోత్తూరు లో విలేకరుల సమావేశం**

ఇల్లంతాకుంట మండలం / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్నినో సాకు చూపి రైతుల నోట్లో మట్టికొడుతోందని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు విమర్శించారు. ఇల్లంతకుంట మండలం పొత్తూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యమానేరు ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా, అలాగే ఎంఎంఆర్ కింది భాగంలో ఉన్న ఆయకట్టుకు సాగునీళ్లు విడుదల చేయాలని కోరుతూ కందికట్కూరు, వంతడుపుల, వల్లంపట్ల, కృష్ణారావుపల్లె, రంగంపేట, గాలిపెల్లి, తాళ్లపెల్లి, పొత్తూరు గ్రామాల రైతులు నెల రోజులుగా ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వేసిన పంటలు నీళ్లు లేక కళ్లముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఏసీ కార్లలో షికార్లు చేయడం తప్ప రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే సాగునీరు విడుదల చేయించాలని సవాలు విసిరారు. మెడిగడ్డ వద్ద నీళ్లు వృధాగా సముద్రంలో పోతున్నా సీఎం రేవంత్ రెడ్డి నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఒకవైపు సాగునీరు లేక, మరోవైపు కనీసం 8 గంటల విద్యుత్ సరఫరా కూడా లేక పంటలు మాడిపోతున్నాయని దుయ్యబట్టారు. మధ్యమానేరు ప్రాజెక్టులో 20 టీఎంసీల నీరు ఉన్నా అనంతగిరి, అన్నపూర్ణ ప్రాజెక్టులకు పంపింగ్ చేయకుండా, కుడికాల్వకు నీళ్లు వదలకుండా 8 వేల ఎకరాలను ఎండబెడుతున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలో మండుటెండల్లోనూ చెరువులు మత్తళ్లు దుంకేలా నీళ్లిచ్చిన చరిత్ర ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు, యూరియా కొరతతో పాటు రైతుభీమా ప్రీమియం చెల్లించకపోవడంతో ఆ పథకం కూడా నిలిచిపోయిందని ఆరోపించారు. సోమవారంలోగా మధ్యమానేరు నుంచి నీటిని విడుదల చేయకపోతే, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నాయకత్వంలో



మంగళవారం వేలాది మంది రైతులతో కలిసి 'చలో మధ్యమానేరు' చేపట్టి కుడి కాల్వ గేట్లు ఎత్తుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పట్నం అశ్విని శ్రీనివాస్, ఉప సర్పంచ్ బండారి నరేష్ గౌడ్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కదురు శేఖర్, నాయకులు ఎడ్ల ప్రశాంత్ రెడ్డి, రొండ్ల కరుణాకర్ రెడ్డి, పట్నం మహేందర్, గుంటి మధు, ఆకుల మహేందర్, ఆకుల అనిల్ కుమార్, తోడేటి సతీష్, దయ్యాల చంద్రమౌళి, గుంటి మల్లేశం, ఒట్టే మల్లేశం, బండారి మహేష్, ఒట్టే శ్రీనివాస్, ఒట్టే అనిల్, గుంటి నాగరాజు, కోల నాగరాజు, కొలుపుల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఏచూరి: సీపీఎం పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్




బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ కొనియాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అమృత లాల్ శుక్ల కార్మిక భవన్‌లో సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. దేశానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి మరికొన్నేళ్ల పాటు విలువైన సేవలు అందించే వయసులోనే ఏచూరి అనారోగ్యంతో మరణించడం తీరని లోటన్నారు. ఆయన మరణించి రెండేళ్లవుతున్నా, దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాల్లో ఆయన ఆలోచనలు, చూపిన మార్గం నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉన్నాయన్నారు. ఏచూరిని స్మరించుకోవడమంటే ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమేనని, లౌకిక ప్రజాస్వామ్య భారత పరిరక్షణకు ఐక్యంగా పోరాడటమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన సమయంలో శ్రామిక, విభిన్న వర్గాల సమస్యల పరిష్కారానికి ఏచూరి సమర్థవంతంగా కృషి చేశారని గుర్తుచేశారు. లోతైన సిద్ధాంత అవగాహన, పదునైన విమర్శలతో కూడిన ఆయన ఉపన్యాసాలను ప్రత్యర్థులు సైతం ఆసక్తిగా వినేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు సిరిమల్లె సత్యం, సూరం పద్మ, ఆడెపు రజిత, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షల్లో విజయానికి ప్రణాళికాబద్ధమైన చదువే మార్గం: ఎస్పీ మహేష్ బి. గితే

**- ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు పోలీస్ శాఖ ప్రత్యేక శిక్షణ**

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

జిల్లాలో ఎస్ఐ, కానిస్టేబుల్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సును జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ముందుగా తమ బలహీనతలను గుర్తించి, ప్రణాళికాబద్ధంగా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి సబ్జెక్టుకు ఉన్న వెయిటేజీని దృష్టిలో ఉంచుకుని సమయపాలనతో ప్రిపరేషన్ కొనసాగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. చదువులో ఎదురయ్యే సందేహాలను నిపుణుల సహాయంతో వెంటనే నివృత్తి చేసుకోవాలని, ఒత్తిడి, ఆందోళనలకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అభ్యర్థులకు సూచించారు. క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. సదస్సులో పరీక్షల విధానం, సమయ నిర్వహణ, ప్రిపరేషన్ వ్యూహాలు, ఫిజికల్ టెస్టులు, గ్రౌండ్ ఈవెంట్లకు సంబంధించిన అంశాలపై నిపుణులు ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు, స్కిల్ గురు డా.



విజయరఘురామరాజు, మహేష్ కుమార్, నవీన్ సుందర్, అమరేష్, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు.

# వేములవాడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ

**- పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలే మేలు: చైర్మన్ పుల్కం రాజు**

వేములవాడ / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లతో కలిసి ప్రజలకు ఈ విగ్రహాలను అందించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తరఫున, మున్సిపల్ పాలకవర్గం తరఫున వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాల విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి నష్టం జరుగుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని కోరారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కార్యాలయంలోనూ మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు తూమ్ మధు, కొండ రాజశేఖర్, తోట రాజు, కొక్కుల బాలకృష్ణ, మైలారం శ్రీనివాస్, ఎలా శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# లింగంపల్లి కూతురు, కనగర్తి మనవరాలి ప్రతిభ.. హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

**- సైనిక్ స్కూల్ సీటు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని గాజుల వర్షిణి**






కొనరావుపేట మండలం / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

కోనరావుపేట మండలం కనగర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గాజుల వర్షిణి ప్రతిష్ఠాత్మక సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో సీటు సాధించి ప్రత్యేకత చాటుకుంది. ప్రభుత్వ బడిలో చదువుకుంటూ జాతీయ స్థాయి పోటీ పరీక్షలో సత్తా చాటడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షిణి స్వస్థలం వేములవాడ గ్రామీణ మండలం లింగంపల్లి గ్రామం కాగా, తల్లితండ్రులు గాజుల తిరుపతి సలోమి. అయితే చిన్నతనం నుంచే అమ్మమ్మ ఊరైన కనగర్తిలో ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తోంది. బడిలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వింటూ, క్రమం తప్పకుండా అధ్యయనం చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకుంది. ఒకేసారి సొంత ఊరు లింగంపల్లికి, చదువుకుంటున్న కనగర్తి గ్రామానికి వర్షిణి మంచి పేరు తీసుకురావడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం వర్షిణిని ఘనంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన పట్టుదల, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని వర్షిణి నిరూపించిందని ఉపాధ్యాయులు కొనియాడారు. భవిష్యత్తులోనూ వర్షిణి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# విద్యుత్ కోతలు విధించొద్దని రైతుల ధర్నా



ప్రజా దివాస్:గంభీరావుపేట

విద్యుత్ కోతలు విధించొద్దని గంభీరావుపేట మండలం గజ సింగవరం గ్రామ బస్టాండ్ ఆవరణలో బిజెపి ఆధ్వర్యంలో శనివారం రైతులు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లో వోల్టేజ్ కరెంటు సరఫరా కావడంతో.. స్టార్టర్లు, మోటర్లు కాలిపోతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బిజెపి మండల అధ్యక్షులు కోడె రమేష్ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలను వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు యూరియా పై అధర్నపు చార్జీలు వసూలు చేయొద్దని చెప్పినా కూడా.. సొసైటీ నిర్వాహకులు యూరియా బస్తా పై అదనంగా రూ.38 వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బిజెపి నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ధర్నాలో ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, సర్పంచ్ రాజిరెడ్డి, బండ దేవయ్య, కార్యదర్శులు స్వామి, రాజు, మహేష్ యాదవ్, నాయకులు వాజిత్, హుస్సేన్, సర్వోత్తమ్, రవీందర్, సత్యనారాయణ, రాజు, సంజీవ్, శ్రీశైలం దేవేందర్ యాదవ్, రమేష్, చంద్రం యాదవ్, పూల్య నాయక్, శ్రీనివాస్ చారి, శ్రీనివాస్ గౌడ్,నారాయణ, దేవ గౌడ్, ఎల్లం, నవీన్, సుదర్శన్,ఎల్లం,దేవరాజ్, మల్లేష్ గౌడ్,రాజేష్, వెంకటేష్ రైతులు పాల్గొన్నారు.

# ఒక వ్యక్తిపై కేసు నమోదు..

వీర్నపల్లి సెప్టెంబర్ 12 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం లోని జవహర్లాల్ నాయక్ తాండ కు చెందిన గుగులోత్ రవి అనే వ్యక్తి ఇంటి ఉన్న కరెంటు బల్బులను వైర్లను ధ్వంసం చేసినందుకు గాను ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మణ్ భూక్య పండరి అనే వ్యక్తిపై కేసు నమోదు చేశానని తెలియజేశారు

# నిరసనలు, ఆందోళనల్లో సంయమనంతో విధులు నిర్వహించాలి..

**-ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్స్‌కు దూరంగా ఉండాలి**

**-ప్రజలతో మర్యాదగా, చట్టబద్ధంగా వ్యవహరించాలి**

**-సిబ్బంది అభిప్రాయాలను తెలుసుకున్న జిల్లా ఎస్పీ**

ప్రజాదివాస్

నిరసనలు, ఆందోళనల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు సంయమనంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిరసనలు, ఆందోళనల సమయంలో పాటించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు.హోంగార్డు స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు బందోబస్తు విధులు అత్యంత కీలకమని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా నిరసనలు, ఆందోళనల సమయంలో ప్రతి సిబ్బంది తమ విధులపై పూర్తి అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును గౌరవిస్తూనే, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితులను సమర్థవంతంగా నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు.ఈ సందర్భంగా నిరసనలు, ఉద్యమాల సమయంలో పోలీసులు పాటించాల్సిన చేయాల్సినవి--చేయకూడనివి అంశాలను సిబ్బందికి వివరించారు. ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మడం, ప్రచారం చేయడం వంటివాటికి దూరంగా ఉండాలని సూచించారు.అనంతరం సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడిన ఎస్పీ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సిబ్బంది ప్రస్తావించిన అంశాలను విశ్లేషిస్తూ వాటి వల్ల పోలీస్ శాఖపై కలిగే అనుకూల, ప్రతికూల ప్రభావాలను వివరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్స్‌కు దూరంగా ఉండాలి పోలీసు సిబ్బంది వ్యక్తిగత జీవితంలోనూ జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ దూరంగా ఉండాలని హెచ్చరించారు. వాటికి బానిస కావడం వల్ల ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలయ్యే ప్రమాదం ఉందని, తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉందన్నారు.పిల్లలు, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్షణిక ఆశలు, ఆకర్షణలకు లోనై జీవితాన్ని





ఇబ్బందుల్లోకి నెట్టే నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. స్నేహితులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు లేదా గేమ్స్‌కు బానిసవుతున్నట్లు గుర్తిస్తే నిర్లక్ష్యం చేయకుండా, వారిని ఆ ఊబి నుంచి బయటపడేలా సహకరించాలని కోరారు.ప్రతి పోలీసు సిబ్బంది ప్రజలతో మర్యాదగా, సంయమనంతో వ్యవహరిస్తూ చట్టబద్ధమైన విధానాలను పాటించాలని, బందోబస్తు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్పీ యం. రాజేష్ చంద్ర సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సంతోష్ కుమార్, నవీన్, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాల తయారీలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు..

ప్రజాదివాస్

వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కామారెడ్డి జిల్లా సదాశివనగర్ తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు.మట్టితో స్వయంగా అందమైన వినాయక విగ్రహాలను రూపొందిస్తూ విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయన రంగులతో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని, అందుకే పర్యావరణహిత మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారు.విద్యార్థులు ఆసక్తిగా మట్టిని ఆకృతులుగా మలుస్తూ గణేశుడి విగ్రహాలను తయారు చేస్తున్నారు. చిన్నారుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు సంప్రదాయ పద్ధతులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఉపాధ్యాయులు తెలిపారు.మట్టి విగ్రహాలను తయారు చేసి, వాటినే వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించాలని విద్యార్థులు ప్రజలకు సందేశం ఇస్తున్నారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# కారు, ద్విచక్ర వాహనం ఢీ.. వ్యక్తికి గాయాలు..

చందుర్తి మండలం / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్





చందుర్తి మండలం మూడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో కలికోట గ్రామానికి చెందిన మొండయ్యకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఏఎంటీ మగ్రి ప్రశాంత్, పైలట్ తోట నరేందర్ ఘటనాస్థలికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం క్షతగాత్రుడిని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# శాంతియుత వాతావరణంలో వినాయక చవితి నిర్వహించాలి..

**-అల్లర్లకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలి**

**-విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి: దేవునిపల్లి ఎస్సై రంజిత్**

ప్రజాదివాస్



కామారెడ్డి పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవునిపల్లి ఎస్సై రంజిత్ మాట్లాడుతూ వినాయక నవరాత్రులను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని సూచించారు.గణేష్ మండపాల నిర్వాహకులు, గ్రామ ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. పండుగ సందర్భంగా గొడవలు, వివాదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని తెలిపారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో మండపాల వద్ద విద్యుత్ వైర్లు, స్తంభాలు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రంజిత్ సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నపిల్లలు మండపాల వద్దకు వచ్చినప్పుడు నిర్వాహకులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.అలాగే గణేష్ ఉత్సవాల్లో డీజేలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యానికి తావులేకుండా పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని మండపాల నిర్వాహకులకు సూచించారు.ప్రజలంతా ఐక్యంగా ఉండి వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించాలని ఎస్సై రంజిత్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ ఓం ప్రకాష్, గ్రామ ప్రజలు, వివిధ గణపతి మండపాల అధ్యక్షులు, నిర్వాహకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించేటట్లు ప్రోత్సహించాలి.....

**- ఈకో ఫ్రెండ్లీ గణేష్ గ్రీన్ వీర్నపల్లి థీమ్ ఎస్సై లక్ష్మణ్**

వీర్నపల్లి సెప్టెంబర్ 12 ప్రజాదివాస్




వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేయబోయే గణేష్ ఫెస్టివల్ ఆర్గనైజర్లతో ఎస్ ఐ లక్ష్మణ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు నవరాత్రి ఉత్సవాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో భాగంగా లిఈకో ఫ్రెండ్లీ గణేష్ గ్రీన్ వీర్నపల్లి అనే థీమ్లిఅనే నినాదం తో వచ్చిన ఆర్గనైజర్లకు మట్టి గణపతుల విగ్రహాలను అందజేశారు ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించేటట్లు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల కొరడా

**- 367 మందిపై కేసులు.రూ.5.17 లక్షల జరిమానా..**

**- 32 మందికి జైలు శిక్ష**

ప్రజాదివాస్

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కామారెడ్డి జిల్లా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 367 మందిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు వారికి మొత్తం రూ.5,17,750 జరిమానా విధించింది.అదేవిధంగా మద్యం సేవించి వాహనం నడిపిన వారిలో 32 మందికి జైలు శిక్ష విధించారు. వీరిలో 7 మందికి ఒక రోజు, 13 మందికి రెండు రోజులు, 6 మందికి మూడు రోజులు, 3 మందికి నాలుగు రోజులు, మరో 3 మందికి ఐదు రోజుల చొప్పున జైలు శిక్ష పడింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. ఇలాంటి ప్రమాదాల వల్ల వాహనం నడిపిన వ్యక్తితో పాటు అమాయకుల ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందన్నారు.ఒక్క క్షణం నిర్లక్ష్యం ఒక కుటుంబం భవిష్యత్తునే మార్చివేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ఒక్క ప్రాణాన్ని కాపాడగలిగినా ఆ కుటుంబంలో వెలుగు నింపినట్లేనన్నారు. ప్రజల ప్రాణాల రక్షణ కోసం జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.మద్యం







సేవించిన తర్వాత వాహనం నడపకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ / సెప్టెంబర్ 12 ప్రజాదివాస్





వినాయక నిమజ్జనం కోసం చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పరిశీలించారు. చెరువులో నిలిచిన చెత్తాచెదారం, వ్యర్థాలను క్రేన్‌ల సహాయంతో తొలగించే పనులను పర్యవేక్షించిన ఆయన, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం సురక్షితంగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా దొమ్మాట రాజు..

ప్రజాదివాస్



మెదక్ జిల్లా నిజాంపేట మండలం తిప్పనగుళ్ల గ్రామానికి చెందిన బీజేపీ దళిత నాయకుడు దొమ్మాట రాజు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మస్కూరి బాలరాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దొమ్మాట రాజు మాట్లాడుతూ పార్టీ కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
13-09-2026

# రాజీ మార్గమే.. రాజ మార్గము

**- జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్**



ప్రజాదివాస్
రాజీమార్గమే రాజమార్గమని, రాజీ కాదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల కాలం, ధనం ఆదా అవుతాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ఎం. రాజేందర్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు పరస్పర అంగీకారంతో వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదికని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో తీసుకునే నిర్ణయానికి ఎలాంటి అప్పీల్ ఉండదని, దీని ద్వారా ఇరువర్గాల మధ్య సామరస్యం పెరుగుతుందని తెలిపారు. రాజీ కుదిరిన బాధితులకు అవార్డు కాపీను అందజేశారు. కక్షిదారులకు పులిహార మరియు మంచినీటి సదుపాయాన్ని ఎస్బిఐ బ్యాంకు వారి సౌజన్యంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్, న్యాయమూర్తులు బి. రవికుమార్, వి. వినయ్ కుమార్ కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. కిరణ్ ముదుల్కర్, నోడల్ ఆఫీసర్ రాఘవయ్య న్యాయవాదులు, బ్యాంకు ప్రతినిధులు, కక్షిదారులు మరియు, ట్రాఫిక్ ఎస్ ఐ, సిబ్బంది, కోర్ట్ పి సి లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్మూర్ లో చౌల్ సాయి శ్రీనివాస్ ఉచితంగా మట్టి గణపతులు పంపిణీ

**- ఆర్మూర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీదేవి**
**- ఎస్ ఎస్ కె సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది)**

ప్రజాదివాస్



ఆర్మూర్ పట్టణంలోని చిన్న బజార్ లో చౌల్ సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై దంపతులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆర్మూర్ క్షత్రియ సమాజ్ అధ్యక్షులు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది) ఆనంద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గణపతి పూజ భక్తి సదులతో ఘనంగా నిర్వహించాలని గణపతి యొక్క ఆశీస్సులు తీసుకోవాలని పేర్కొన్నారు. గణపతి మండప వివాహకులు గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని శాంతియుత వాతావరణం లో గణపతి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాగే ఈ సంవత్సరం కూడా చౌల్ సాయి ప్రభాస్ ఉచిత మట్టి గణపతులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణం లో ప్రతి ఒక్కరూ పాలు పట్టించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జక్కుల శ్రీధర్, జెస్సు ఆనంద్ న్యాయవాదులు పాల్గొన్నారు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

ప్రజాదివాస్



పెనుబల్లి మండలంలోని లక్ష టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మన వంతు బాధ్యతగా గత 13 సంవత్సరాల నుండి మన స్కూలు ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పెనుబల్లి మండల సిఐ మరియు తహసిల్దార్ హాజరయ్యారు

# ప్రతీ విగ్రహం స్టేడియం గ్రౌండ్ కు వచ్చేలా చర్యలు తీసుకోండి

**- నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోండి**
**- గణేష్ నిమర్జన ఉత్సవ కమిటీ అధ్యక్షులు యెర్రా కామేష్**

ప్రజాదివాస్
కొత్తగూడెం: గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిమజ్జన కమిటీ అధ్యక్షులు, న్యాయవాది యెర్రా కామేష్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత పవిత్ర గోదావరి నదిలో ఎక్కువ సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం జరుగుతుందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గణపతి విగ్రహాలు పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనానికి తరలి వెళ్తాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదే విధంగా జిల్లా కేంద్రంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో గణపతి ప్రతిమలను ఏర్పాటు చేసిన వారు సాధ్యమైనంత తొందరగా ప్రకాశం స్టేడియం గ్రౌండ్ కు చేరుకునేలా ముందస్తు ప్రణాళికను రూపొందించుకోవాలని కోరారు. గతంలో స్థానిక ప్రకాశం స్టేడియం వచ్చిన తర్వాతే నిమజ్జనానికి వెళ్లే విధంగా రూట్ మ్యాప్ ఉండేదని గుర్తు చేశారు కాలక్రమేనా ఈ విధానానికి స్వస్తి పలకడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని 25వ తేదీన జరిగే గణపతి శోభాయాత్రను ప్రకాశం స్టేడియం గ్రౌండ్ నుంచి అనుమతించాలని ఆవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులకు, పోలీసు యంత్రాంగానికి, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న తరుణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు మొదలవడం శుభసూచకమని అన్నారు. గణపతి నిమజ్జన శోభాయాత్ర ముగిసేవరకూ బెల్టు షాపులను ఓపెన్ చెయ్యకుండా ఎక్సైజ్, పోలీసు శాఖ వారు చర్యలు తీసుకోవాలని, వారికి మద్యం షాపు యజమానులు సహకరించాలని కోరారు. నిమజ్జన శోభాయాత్రను ప్రకాశం స్టేడియం గ్రౌండ్ లో ఒంటిగంటకు పూజ చేసి ప్రారంభించడం జరుగుతుందని ఈలోగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు తమ తమ ప్రతిమలతో ప్రకాశం స్టేడియం గ్రౌండ్ కు చేరుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు ఒంటిగంట నుంచే గణపతి శోభాయాత్రను ప్రారంభించడం



ద్వారా పవిత్ర భద్రాద్రి గోదావరి నదిలో నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు సహకరించిన వారమవుతామని తెలిపారు గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల తో ముడిపడి ఉన్నదని ఈ విషయాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు గమనించాలన్నారు టపాసులు పేలుస్తూ, పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ డీజే బాక్సులతో ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా సాంప్రదాయ వాయిద్యాలతో భక్తి భావంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఏ. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దారా రమేష్, వందనపు శ్రీధర్, అకిరెడ్డి మహేష్, మెరుగు చింటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పై స్పందించరా!

**- మాజీ కార్పొరేటర్ తోట రామారావు**

ప్రజాదివాస్
పడకేసిన పారిశుధ్యం! కార్పొరేషన్ అధికారుల పనితీరు పై మండిపడ్డ మాజీ కార్పొరేటర్ తోట రామారావు.......ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్ లో పడకేసిన పారిశుధ్యం పై, కార్పొరేషన్ అధికారుల పని తీరు పై శనివారం మాజీ కార్పొరేటర్ తోట రామారావు మరో సారి మండి పడ్డారు. 48వ డివిజన్ ప్రాంత పరిధి పెద్దదని పూర్తి స్థాయిలో సిబ్బంది లేక పారిశుధ్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిబ్బంది పెంచాలని, విపరీతంగా పెరిగిన చెట్లు, చెత్తను పరిశుభ్రం చేసే విధంగా వారంలో మూడు రోజులు జేసీబీ కేటాయించాలని అనేకమార్లు మాజీ ప్రజా ప్రతినిధిగా వినతి పత్రం ఇచ్చిన స్పందించే పరిపాలన లేదని సామాన్య మానవుని పరిస్థితి ఏంటి అని కార్పొరేషన్ అధికారులపై మండిపడ్డారు.



కార్పొరేషన్ అధికారులు స్పందించకపోయినా ఈ ప్రాంత మాజీ ప్రజా ప్రతినిధిగా వాళ్ళ సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత మాపై ఉందని. ప్రజా ఆరోగ్య దృష్ట మా సొంత నిధులతో అనేకసార్లు జేసీబీ ఏర్పాటుచేసి పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టిని సారించామని ప్రస్తుతం మరల సొంత నిధులతోనే జేసీబీ ఏర్పాటు చేసుకొని స్థానిక గణేష్ నగర్ ప్రాంతంలో డ్రైనేజు, విపరీతంగా పెరిగిన చెత్తాచెదారులను, వినాయక చవితి పండగను పురస్కరించుకొని గణేష్ మండపాల స్థలాలు కూడా పరిశుభ్రం చేస్తున్నట్టు తెలియజేశారు. గత వారం భగీరథ పైపులైను నిర్మాణంలో కూడా మా సొంత ట్యాంకర్ తో ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచినీటి సరఫరా చేయడం జరిగిందని. ఇలా ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యలపై స్పందిస్తూ ఎప్పటికప్పుడు వారి సమస్యల పరిష్కారంలో ఉన్న సందర్భంలో అనేకసార్లు కార్పొరేషన్ అధికారులకు సిబ్బంది విషయం, జేసీబీ తదితర అవసరాల నిమిత్తం ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చిన స్పందించకపోవడం చాలా బాధాకరమని తెలియజేస్తూ ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రజలకు అవసరమైన పారిశుద్ధ్యం, మంచినీటిపై తగు చర్య తీసుకోవాలని స్థానిక ప్రజలతో గల మెత్తారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ బాబు, అంజయ్య, గుణ గంటి శ్రీనివాస గౌడ్, యాసారపు ఉపేందర్ , తోట రమేష్, చేతి క్రిష్ణ, రమణ, ప్రభాకర్, నవీన్, కిషన్ నాయక్, బాబా తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**- మట్టి గణపతుల ఉచిత పంపిణీతో పర్యావరణ పరిరక్షణకు లయన్స్ క్లబ్ పిలుపు**
**- లయన్ కంచర్ల రమేష్ సహకారంతో 1,000 మట్టి వినాయకుల పంపిణీ**

ప్రజాదివాస్
అశ్వరావుపేట: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అశ్వరావుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ మట్టి గణపతుల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్కినేని నరేంద్రబాబు ఆధ్వర్యంలో, లయన్ కంచర్ల రమేష్ సహకారంతో సుమారు 1,000 మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అశ్వరావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు. అశ్వరావుపేట ఎస్సై యయాతి రాజు. హాజరై భక్తులకు మట్టి గణపతులను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ అశ్వరావుపేట సభ్యులు ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన




కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవచ్చని, మట్టి గణపతి వినియోగం ప్రకృతి పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. వినాయక చవితి కేవలం భక్తి పండుగ మాత్రమే కాకుండా ప్రకృతిని కాపాడే పండుగగా కూడా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు మరియు సభ్యులు అశ్వరావుపేట మండల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ సేవా కార్యక్రమాలను పలువురు అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు యూఎస్ ప్రకాష్, కోటగిరి మోహన్ రావు, బలమూరి సూర్యరావు, జూపల్లి రమణారావు, మేడవరపు శ్రీనివాసరావు, సమయమంతుల మహేశ్వరరావు, కంచర్ల భాస్కర్, కంచర్ల రమేష్, సుబ్బారావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, తాడేపల్లి రవి, దోబుగుంట్ల దుర్గారావు, సుబ్రహ్మణ్యం, శ్రీను, తిరుమల శెట్టి వెంకన్న, దేవరాజు, జలిపల్లి లక్కదాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక పక్క అసెంబ్లీ సమావేశాలు.. మరో పక్క మాక్ అసెంబ్లీ!

**- ప్రజల సమస్యలు పక్కనపెట్టి రాజకీయ ప్రదర్శనలెందుకు?**

**- ఆబాద్ పార్టీ అధ్యక్షుడు హాసన్**

ప్రజాదివాస్

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే భారత రాష్ట్ర సమితి తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ పేరిట సమావేశాలు నిర్వహించడంపై ఆబాద్ పార్టీ అధ్యక్షుడు హాసన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన సమయంలో రాజకీయ ప్రదర్శనలు నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు."ఒక పక్క రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే, మరో పక్క మాక్ అసెంబ్లీ పేరుతో ప్రత్యామ్నాయ సభ నిర్వహించడం ఎందుకు? ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్నుకున్న నాయకులు అసెంబ్లీలో ప్రజల గొంతుకగా నిలబడాలి. అంతేకానీ, సభల పేరుతో రాజకీయ పోటీలు నిర్వహించడం వల్ల ప్రజలకు ప్రయోజనం ఏమిటి?" అని హాసన్ ప్రశ్నించారు.

హాసన్ మాట్లాడుతూ,మాక్ అసెంబ్లీలు కాదు.. ప్రజా సమస్యలపై చర్చ కావాలని తెలంగాణ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని . రైతులు వర్ష భావం భూముల సమస్యలు, యువత నిరుద్యోగం, విద్యార్థులు విద్యా సమస్యలు, సామాన్యులు వైద్యం మరియు ధరల పెరుగుదలతో సతమతమవుతున్నారు. ఇలాంటి సమయంలో మాక్ అసెంబ్లీలు నిర్వహించడం కంటే, అసెంబ్లీలోనే ప్రజా సమస్యలపై బలమైన చర్చ జరగాలి" అన్నారు."ప్రజాస్వామ్యం అంటే కేవలం సభలు నిర్వహించడం కాదు.. ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపించడం. అసెంబ్లీకి ప్రత్యామ్నాయంగా మాక్ అసెంబ్లీలు నిర్వహించడం ద్వారా ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించకూడదు" అని ఆయన పేర్కొన్నారు.అధికార పక్షం, ప్రతిపక్షం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి "అధికార పక్షం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రతిపక్షం కూడా ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రస్తావించాలి. సభా సమయాన్ని సద్వినియోగం



చేసుకుని ప్రజల సమస్యలపై చర్చించాలి. పరస్పర విమర్శలు, రాజకీయ ప్రదర్శనలతో ప్రజలకు ఎలాంటి మేలు జరగదు" అని హాసన్ అన్నారు."తెలంగాణ ప్రజలకు కావాల్సింది మాక్ అసెంబ్లీలు కాదు.. నిజమైన ప్రజా పాలన. రాజకీయ ప్రదర్శనలకు స్వస్తి పలికి, ప్రజల సమస్యల పరిష్కారానికి అధికార పక్షం, ప్రతిపక్షం కలిసి పనిచేయాలని ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని ఆబాద్ పార్టీ అధ్యక్షుడు హాసన్ సూచించారు.

# చౌల్ సాయి శ్రీనివాస్ ప్రభాస్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ పాల్గొన్న ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరావత్రి రాజశేఖర్

**- ఎస్ ఎస్ కే క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు**

**గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది)**

ప్రజాదివాస్



ఆర్మూర్ పట్టణం లో ని చిన్న బజార్ చౌల్ సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం లో ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ఆరాధించాలని కోరారు. చౌల్ సాయి శ్రీనివాస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రాబోయే పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఈ ఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, ఓమ్ ట్రేడర్స్ గంగ మోహన్, కేవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ వార్డు కమిటీల నియామకం..

ప్రజాదివాస్

కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో పట్టణంలోని 5, 29, 30వ వార్డులకు నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఏర్పాటు చేశారు.కామారెడ్డిలోని హసన్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ ఆధ్వర్యంలో వార్డు నాయకులతో సమావేశం నిర్వహించి, అనంతరం నూతన వార్డు కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి




పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.నూతనంగా నియమితులైన వార్డు కమిటీ అధ్యక్షులు, నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, ఇప్ప శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు పండ్ల రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు భూమని బాలరాజ్, కామారెడ్డి మండల అధ్యక్షుడు రాజాగౌడ్, బిక్కనూర్ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, గుడుగుల శ్రీనివాస్, వడ్ల సురేష్, సిరాజుద్దీన్, కౌన్సిలర్లు, అంజత్, మాజీద్, లడ్డు, అన్వర్ అహ్మద్, సిద్ధిక్, ఖదీర్, మసూద్ అలీ, పిల్లి మల్లేష్, రామ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు అలీబిన్ అబ్దుల్లా, ఎన్.ఎస్.యు.ఐ. అధ్యక్షుడు వెంకటేష్, గోనె శ్రీనివాస్, సురేష్, హనుమాన్ల రవి, ఎజాస్, మౌలు, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం

**- మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి**

**7.50 కోట్ల నిధులు మంజూరు.**

ప్రజాదివాస్




ఈరోజు ఆర్మూర్ మున్సిపల్ లో నూతన భవన ఏర్పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలభిషేకం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు పాలభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మున్సిపల్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి 7.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ గోనె లహరి రఘు, మాట్లాడుతూ, ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి మహర్దశ పట్టిందన్నారు. నిధులు మంజూరు చేయడంతో నూతన భవన నిర్మాణానికి త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలు నిరాజనాన్ని పలుకుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం ,అభివృద్ధికి ప్రజలు పట్టం కడుతున్నారన్నారు ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రికి సీతక్క, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, అధికార ప్రతినిధి సుదర్శన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ కుమార్ రెడ్డి,లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సాయిబాబాగౌడ్, మాజీ పిసిసి కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, రవి గౌడ్, సడక్ వినోద్, కోడిగల మల్లయ్య, నవీన్, గంగులి గౌడ్, నర్మే నవీన్, సల్మాన్ భూపేందర్, కాంగ్రెస్ నాయకులు చిట్టి రెడ్డి, మారుతి రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాశిగామ పాఠశాల అభివృద్ధికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ రూ.18 లక్షల నిధులు

**- విద్యార్థులను సర్‌ప్రైజ్ చేస్తూ ఎంపీ నిధుల ప్రకటన.. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత**

ప్రజాదివాస్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కీలక నిర్ణయం తీసుకున్నారు.జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాశిగామ గ్రామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన ఎంపీలుడ్స్ నిధుల నుంచి రూ.18 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు పాశిగామ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఎంపీ వంశీకృష్ణ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారి సమక్షంలో పాఠశాల అభివృద్ధికి రూ.18 లక్షల నిధులు ప్రకటించి విద్యార్థులను సర్‌ప్రైజ్ చేశారు.ఈ నిధులతో పాఠశాల కు రెండు తరగతి గదులు నిర్మాణం కు అలాగే విశాఖ చారిటేబుల్ ట్రస్ట్ నుండి విద్యార్థులకు అవసరమైన బెంచీల ఏర్పాటుతో పాటు పాఠశాల భవనం, మౌలిక వసతుల అభివృద్ధికి విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యనభ్యసించేలా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంపీ వంశీకృష్ణ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి, విద్యార్థులకు మంచి అభ్యసన వాతావరణం అందించడమే మా లక్ష్యం" అని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు.పాశిగామ పాఠశాల సమగ్ర అభివృద్ధికి రూ.18 లక్షలు మంజూరు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్.కాంద్రపు. శిరీష జిల్లా గ్రంధాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్ శర్మ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలందర్ రెడ్డి ఏ ఎం సి చైర్మన్ గొల్ల తిరుపతి కోటిలింగాల ఆలయ చైర్మన్ పూదరి రమేష్ ధర్మారం మండల




కాంగ్రెస్ పార్టీ నాయకులు కాడే సూర్యనారాయణ సొగల మురళి మండల సర్పంచ్ లా ఫోరం అధ్యక్షులు కూస. లక్ష్మణ్ వెంకటాపూర్ సర్పంచ్ బిళ్ళకూరి తిరుపతి రాయపట్నం సర్పంచ్ రాందేని మొగిలి బరపటి జెనర్ధన్ గోపతి నరేష్ మెరుగు మురళి గౌడ్ సందీప్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంపత్ మరియు ఉపాధ్యాయులు స్థంభంపల్లి సర్పంచ్ భూపల్లి రాజయ్య స్థంభంపల్లి, పాషిగామ ఉప సర్పంచ్ లు యాగండ్ల గంగయ్య కొత్తూరి భూమయ్య గుమ్ముల వెంకటేష్ ధర్మపురి ఏ ఎమ్ సి వైస్ చైర్మన్ నర్సిగం సప్ప లింగయ్య చెంబర్తి కొమురయ్య పాతగూడూర్ మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి ధర్మారం సత్యం గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాలొగొన్నారు

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి..

**- అదనపు కలెక్టర్ నగేష్**

ప్రజాదివాస్



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను సూచించారు. శనివారం మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలోని రికార్డులు, వివిధ ఫారాలను పరిశీలించారు. ముఖ్యంగా ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్ల చేర్పులు, సవరణలకు సంబంధించిన ఫారం-6, 7, 8 వివరాలను పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరికీ ఓటు హక్కు విషయంలో అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ సతీష్, సిబ్బంది ఉన్నారు.